

పాఠకులకు ప్రకటన కర్తలకు మిత్రులకు శ్రేయోభిలాషులకు హోలీ పర్వదిన శుభాకాంక్షలు...
- రజనీ పగిళ్ల,
మేనేజింగ్, డైరెక్టర్


# విశాల భారతి

4-03-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 59


## 99డేస్ యాక్షన్ ప్లాన్
# సక్సెస్ చేయాలి

- ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల ప్రగతి ప్రణాళిక అమలు
- 10 రకాల థీమ్స్, 5 స్థాయిల్లో కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం
- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సాగాలని సీఎం పిలుపు
- గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్దిష్ట గడువుతో లక్ష్యాల ఖరారు
- విద్య, వైద్యం, సంక్షేమ పథకాల లబ్ధిపై క్షేత్రస్థాయిలో అవగాహన
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్ అందజేత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనను మరింత చేరువ చేసేందుకు, సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ చేరవేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహానికి తెరలేపారు. సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' యాక్షన్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు సుమారు వంద రోజుల పాటు సాగే ఈ ప్రత్యేక కార్యాచరణ ద్వారా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పనిచేస్తేనే ప్రజా ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయని ఆయన స్పష్టం చేశారు.



మిగతా 2లో..

# ఎమ్మెల్సీ కవిత అరెస్టు



- నార్సింగిలో మూసీ నది ఆక్రమణల వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ధర్నా
- అక్రమ కట్టడాలపై హైడ్రా బుల్డోజర్లు వచ్చే వరకు కదిలేది లేదని భీష్మం
- పేదల ఇళ్లు కూల్చే సర్కారుకు ఈ విలాసవంతమైన భవనాలు కనిపించడం లేదా అని ప్రశ్న
- ఆందోళనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకున్న నార్సింగి పోలీసులు
- 'జాగృతి జనంబాట'లో భాగంగా అక్రమ వెంచర్ల గుట్టు రట్టు చేస్తామని హెచ్చరిక
- గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న ఆక్రమణలపై విచారణకు డిమాండ్

04

## అమెరికా-ఇరాన్ మధ్య
# భీకర దాడులు



### ఇరాన్ ఐఆర్‌జీసీ స్థావరాలే లక్ష్యంగా అమెరికా బాంబర్ విమానాల విలయం
### బహ్రెయిన్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై ఇరాన్ డ్రోన్ల దాడి

పశ్చిమాసియా ప్రాంతం మరోసారి యుద్ధ జ్వాలలతో అట్టుడుకుతోంది. అగ్రరాజ్యం అమెరికా,ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండ్ కంట్రోల్ సెంటర్లను తాము ధ్వంసం చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ఇరాన్ సైనిక యంత్రాంగానికి వెన్నెముకగా ఉన్న మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు నిర్వహించినట్లు వెల్లడించింది. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. మంగళవారం తెల్లవారుజామున అమెరికా తన అమ్ములపొదిలోని శక్తివంతమైన బీ-1 బాంబర్ విమానాలను రంగంలోకి దించింది.



- ఇజ్రాయెల్ స్థావరాలపై హిజ్బుల్లా విరుచుకుపాటు.. ప్రతిగా బీరుట్‌పై దాడులు
- హిజ్బుల్లా నిఘా విభాగం అధిపతి హతమయ్యాడని ఇజ్రాయెల్ ప్రకటన
- లెబనాన్‌లో హిజ్బుల్లా సైనిక కార్యకలాపాలపై ఆ దేశ ప్రభుత్వ నిషేధం
- సౌదీ, బహ్రెయిన్, జోర్డాన్ దేశాల్లోని పౌరులకు అమెరికా అత్యవసర ఆదేశాలు

02



# కన్నీటి సంద్రమైన ఇరాన్

- ఇరాన్ దక్షిణ ప్రావిన్స్‌లోని మినాబ్ పాఠశాలపై ఇజ్రాయెల్ భీకర దాడి
- దాడిలో 160 మందికి పైగా పాఠశాల విద్యార్థినుల విషాద మృతి
- పక్కపక్కనే 160 శవపేటికలు.. ఒకేచోట సామూహిక అంత్యక్రియలు
- అగ్రనేత ఖమేనీ మరణం తర్వాత ఇరాన్‌ను కుదిపేసిన భారీ విషాదం
- శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ బృందాలు
- నల్ల జెండాలతో నిరసన.. యుద్ధం ఆపాలంటూ ప్రపంచ దేశాల ఆవేదన

**విశాలభారతి, అంతర్జాతీయం:**

మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, ఇరాన్ గడ్డపై గుండెలు పిండేసే విషాదం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆ దేశం, ఇప్పుడు మసిబారిపోయిన చిన్నారుల భవిష్యత్తును చూసి శోకసంద్రంలో మునిగిపోయింది. దక్షిణ ప్రావిన్స్ హార్మోజ్‌గాన్‌లోని మినాబ్ నగరంలో ఒక పాఠశాలే లక్ష్యంగా జరిగిన వైమానిక దాడి, ప్రపంచ మానవత్వాన్నే ప్రశ్నిస్తోంది. విజ్ఞానాన్ని నేర్చుకోవాల్సిన విద్యా నిలయం కాస్తా, క్షణాల వ్యవధిలో శ్మశాన వాటికగా మారిపోవడం అక్కడి ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. యుద్ధం ఎంతటి దారుణాలకు ఒడిగడుతుందో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. మినాబ్ నగరంలోని ఆ పాఠశాలపై

మిగతా 3లో..

# ఇరాన్ కాళ్ల బేరానికి వస్తోంది

- చర్చలకు ఇరాన్ సిద్ధమన్న వార్తలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర స్పందన
- గగనతల, నౌకాదళం ధ్వంసమయ్యాక చర్చలంటే 'చాలా ఆలస్యం' అని వ్యాఖ్య
- ఫిబ్రవరి 28న మొదలైన దాడులను సమర్థిస్తూ అమెరికా కాంగ్రెస్‌కు ట్రంప్ లేఖ
- పశ్చిమాసియాలో అమెరికా ప్రయోజనాలు, మిత్రదేశాల రక్షణే లక్ష్యమని వెల్లడి
- ఇరాన్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు.. సీనియర్ సైనిక కమాండర్ మృతి
- దాడుల్లో చిన్నారుల మృతిపై ఇరాన్ ప్రజల్లో మిన్నంటిన ఆగ్రహం.. నాలుగో రోజూ సమరం

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియా రణక్షేత్రంగా మారింది. అగ్రరాజ్యం అమెరికా, ఇజ్రాయెల్ జంటగా ఇరాన్‌పై విరుచుకుపడుతుండటంతో గల్ఫ్ దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ శాంతి

మిగతా 3లో..



# నిప్పుల గుండంలా హర్మూజ్

- హర్మూజ్ జలసంధిని అధికారికంగా మూసివేసినట్లు ఇరాన్ ప్రకటన
- నిబంధనలు అతిక్రమిస్తే నౌకలను తగలబెడతామని ఐఆర్‌జీసీ హెచ్చరిక
- సముద్ర మార్గంలో చిక్కుకుపోయిన 700లకు పైగా భారీ నౌకలు
- ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం నిలిచిపోయే ముప్పు
- అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న ముడి చమురు ధరలు
- పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు

02



# ఒక్క రోజు యుద్ధం ఖరీదు రూ. 7,100 కోట్లు

- ఇరాన్-అమెరికా మధ్య ముదురుతున్న యుద్ధ జ్వాలలు
- ఒక్క రోజు యుద్ధానికే అమెరికాకు రూ. 7,100 కోట్ల ఖర్చు
- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో విరుచుకుపడుతున్న అగ్రరాజ్యం
- యుద్ధ విమాన నౌకల నిర్వహణకే రోజుకు రూ. 59 కోట్లు
- ఇప్పటికే కువైట్‌లో కూలిన మూడు అత్యాధునిక యుద్ధ విమానాలు
- యుద్ధం పొడిగిస్తే అగ్రరాజ్యానికి ఆర్థిక మాంద్యం ముప్పు

02




# గల్ఫ్ నుంచి స్వదేశానికి భారతీయులు

- ఇజ్రాయెల్-అమెరికా యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయుల తరలింపు ప్రారంభం
- అబుదాబి నుంచి కొచ్చికి చేరుకున్న వంద మంది ప్రయాణికులు
- ఉద్రిక్తతలతో కొచ్చి నుంచి మధ్యప్రాచ్యానికి 31 విమాన సర్వీసులు రద్దు
- ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశ ఎయిర్‌లైన్స్ కీలక నిర్ణయం

03

# ఖజానా ఖాళీ.. పార్టీకి వేల కోట్లా?

- తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం వైఫల్యంపై కిషన్ రెడ్డి ధ్వజం
- నిధులు లేవంటూనే పార్టీకి రూ.1000 కోట్లు ఇస్తామనడంపై విస్మయం
- రాష్ట్ర ఖజానా నిల్.. కాంగ్రెస్ నేతల జేబులు ఫుల్ అంటూ ఎద్దేవా
- గత 12 ఏళ్లలో తెలంగాణకు మోదీ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల కేటాయింపు
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే నిధుల వివరాలపై స్పష్టత ఇవ్వాలని వినతి

03



# ఒక్క రోజు యుద్ధం ఖరీదు రూ.7,100 కోట్లు

**విశాలభారతి, అంతర్జాతీయం:**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఒకటే చర్చ.. అదే ఇరాన్‌అమెరికా మధ్య సాగుతున్న భీకర పోరు. అగ్రరాజ్యం అమెరికాకు తోడుగా ఇజ్రాయెల్ కూడా తోడవడంతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మొదలైన ఈ యుద్ధం, ఇప్పుడు గల్ఫ్ ప్రాంతమంతటా వ్యాపించి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తోంది. యుద్ధం అంటే కేవలం సైనికుల పోరాటం మాత్రమే కాదు, అది దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీసే ఒక ఖరీదైన వ్యవహారమని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మంగళవారం నాటికి ఈ యుద్ధం నాలుగో రోజుకు చేరుకోగా, అగ్రరాజ్యం కురిపిస్తున్న బాంబుల కంటే అవి కరిగిస్తున్న డాలర్ల గురించే ఇప్పుడు అంతటా చర్చ జరుగుతోంది. ఒక దేశంపై యుద్ధం ప్రకటించడం అంటే అది మామూలు విషయం కాదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధం కనీసం నాలుగు వారాల పాటు కొనసాగవచ్చని, తమ వద్ద అపారమైన సైనిక సామర్థ్యం ఉందని చెబుతున్నప్పటికీ, ఆచరణలో అది పెను భారంగా మారుతోంది. యుద్ధాలు ఎప్పుడు మొదలవుతాయో ఎవరూ ఊహించలేరు కానీ, అవి ముగిసే సమయానికి దేశాల ఆర్థిక వ్యవస్థలు చితికిపోవడం ఖాయం. ఇప్పటికే అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యులు ధరల భారంతో సతమతమవుతుంటే, మరోవైపు ప్రజాధనాన్ని యుద్ధ ట్యాంకులు, మిస్సైళ్ల రూపంలో ఖర్చు చేయడంపై అంతర్గతంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అగ్రరాజ్యం ఎంతటి సంపన్న దేశమైనా ఈ స్థాయి ఖర్చును భరించడం కత్తిమీద సామే.



టర్కీకి చెందిన 'అనడోలు' వార్తా సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, ఇరాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ప్రారంభమైన తొలి 24 గంటల్లోనే అమెరికాకు సుమారు 779 మిలియన్ డాలర్లు ఖర్చయింది. మన భారతీయ కరెన్సీలో ఇది దాదాపు రూ. 7,100 కోట్లకు పైమాటే. యుద్ధం పూర్తిస్థాయిలో మొదలవ్వకముందే తన భారీ యుద్ధ నౌకలను, విమానాలను, వేలాది మంది సైనికులను పశ్చిమాసియాకు తరలించేందుకే అమెరికా మరో రూ. 5,700 కోట్లు ఖర్చు చేసింది. అంటే తుపాకీ గుండు పేలకముందే వేల కోట్లు గాలిలో కలిసిపోయాయన్నమాట. యుద్ధం రోజురోజుకు ముదురుతున్న కొద్దీ ఈ వ్యయం ఊహించని స్థాయికి చేరుకుంటోంది.

అమెరికా రక్షణ వ్యవస్థలోని అత్యాధునిక యుద్ధ విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్' వంటి నౌకల నిర్వహణ ఖర్చు వింటే సామాన్యులు విస్తుపోవాల్సిందే. ఇవి యుద్ధం చేసినా చేయకపోయినా, కేవలం సముద్రంలో నిలిపి ఉంచినందుకు రోజుకు రూ. 59 కోట్ల నిర్వహణ వ్యయం అవుతుంది. ఇవి కాకుండా గల్ఫ్ ప్రాంతంలో మోహరించిన క్యారియర్ స్ట్రైక్ గ్రూపుల కోసం రోజుకు మరో 6.5 మిలియన్ డాలర్లు వెచ్చించాల్సి వస్తోంది. ఆయుధాలను కాపాడుకోవడానికే కోట్ల రూపాయలు ఖర్చవుతుంటే, ఇక ప్రత్యక్ష పోరాటంలో జరిగే నష్టం అంచనాలకు అందడం లేదు. అగ్రరాజ్యం తన అమ్ములపొదిలోని సంపదను వినాశనం కోసం ధారపోస్తోంది.

యుద్ధంలో నగదు నష్టమే కాకుండా ఆయుధాల రూపంలో కూడా భారీ నష్టం వాటిల్లుతోంది. కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు అత్యాధునిక యుద్ధ విమానాలు 'ఫ్రెండ్లీ ఫైర్' కారణంగా కూలిపోవడం గమనార్హం. వీటి విలువ వందల కోట్లు ఉంటుంది. ఇరాన్ దాడుల్లో F18, F16 వంటి విమానాలతో పాటు అత్యంత ఖరీదైన F35 స్టీల్త్ ఫైటర్లను కూడా అమెరికా వినియోగిస్తోంది. ఈ విమానాల ఆపరేషన్ ఖర్చు మాత్రమే సుమారు 271 మిలియన్ డాలర్లుగా అంచనా వేస్తున్నారు. ఒక్కో డ్రోన్, ఒక్కో క్షిపణి ప్రయోగం వెనుక సామాన్యుడి పన్ను సొమ్ము బాంబుల రూపంలో పేలిపోతోంది. ఇదంతా ఎవరి కోసం అన్న ప్రశ్న ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తలెత్తుతోంది. అమెరికాకు గత యుద్ధాల అనుభవాలు కూడా చేదుగానే ఉన్నాయి. గతంలో ఆఫ్ఘనిస్తాన్‌లో 20 ఏళ్ల పాటు సాగిన యుద్ధంలో అమెరికా ఏకంగా 2.3 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఆ యుద్ధంలో పాల్గొన్న సైనికుల సంరక్షణ కోసం 2050 నాటికి మరో 2 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా. ఇప్పుడు ఇరాన్‌తో యుద్ధం నిరవధికంగా సాగితే, అమెరికా రక్షణ నిల్వలు హరించుకుపోయి ఆ దేశ రక్షణ వ్యవస్థకే ముప్పు వచ్చే ప్రమాదం ఉందని రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అగ్రరాజ్యం తన దగ్గరున్న అమ్ములపొదిని ఖాళీ చేసుకుంటూ ఆర్థికంగా తన కాళ్లపై తానే గొడ్డలి పెట్టుకుంటోంది.

గత రెండేళ్లుగా పశ్చిమాసియాలో జరుగుతున్న ఘర్షణల వల్ల అమెరికాకు ఇప్పటి వరకు అయిన ఖర్చు దాదాపు రూ. 3.1 లక్షల కోట్ల పైమాటే. ఇజ్రాయెల్‌కు భారీగా ఆయుధ సాయం చేయడం, ఎమెన్‌లోని హౌతీ రెబల్స్‌పై దాడులు చేయడం అగ్రరాజ్యానికి తలకు మించిన భారంగా మారింది. ప్రస్తుతం అమెరికా రక్షణ బడ్జెట్ 1.5 ట్రిలియన్ డాలర్లకు చేరినప్పటికీ, యుద్ధం ఇలాగే కొనసాగితే ఆ నిధులు కూడా సరిపోని పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ యుద్ధ ప్రభావంతో చమురు ధరలు పెరిగి ప్రపంచవ్యాప్తంగా రవాణా ఖర్చులు ప్రియమవడంతో పాటు, అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం పడుతోంది.

యుద్ధం వల్ల కలిగే సామాజిక నష్టం అపారం. సైన్యంతో పాటు వేలాది మంది నిరపరాధులైన సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇరాన్ చేసే ప్రతిదాడి వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయి. ఒక దేశం ఆర్థికంగా చితికిపోవడానికి ఒక్క యుద్ధం చాలు. ఇరాన్ లాంటి దేశంపై అమెరికా తన శక్తినంతా ఉపయోగిస్తుంటే, అటు నుంచి వచ్చే ప్రతిఘటన వల్ల అమెరికా స్థావరాలు కూడా దెబ్బతింటున్నాయి. ఇది ఒక విషవలయంలా మారి రెండు దేశాల అభివృద్ధిని దశాబ్దాల వెనక్కి నెట్టివేస్తోంది. వినాశనం తప్ప విజయం లేని పోరుగా ఇది మారుతోంది.

ప్రపంచంలోని ఎన్నో పేదరిక సమస్యలను, ఆరోగ్య సంక్షోభాలను పరిష్కరించాల్సిన అపారమైన సంపద నేడు కేవలం బాంబుల రూపంలో ధ్వంసమవుతోంది. ఒక్క రోజుకు 7 వేల కోట్ల ఖర్చు అంటే అది సామాన్య విషయం కాదు. ఈ నిధులతో ఎన్నో దేశాల్లో విద్యా, వైద్య సదుపాయాలను మెరుగుపరచవచ్చు. కానీ, రాజకీయ ప్రయోజనాల కోసం, ఆధిపత్య పోరు కోసం అగ్రరాజ్యాలు యుద్ధాన్ని ఎంచుకోవడం విచారకరం. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో ఎవరూ ఊహించలేకపోతున్నారు, కానీ అది మిగిల్చే శ్మశాన నిశ్శబ్దం మాత్రం అందరికీ ముందే తెలుసు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి




**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**విశాలభారతి:**

సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి నిజమైన అర్హులందరికీ అందేలా కలెక్టర్లు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామ సభల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించాలని, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులపై గ్రామ స్థాయి నుంచి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులను సమీపంలోని మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయడం ద్వారా సామాన్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహించే ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు కచ్చితంగా చెల్లించబడేలా చూడాలని ముఖ్యమంత్రి సదస్సులో స్పష్టం చేశారు. 99 డేస్ ప్రోగ్రామ్‌లో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టించాలని నిర్ణయించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీని కోసం అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు.

# 99డేస్ యాక్షన్ ప్లాన్ సక్సెస్ చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ ప్రతిష్ఠాత్మక యాక్షన్ ప్లాన్‌ను మొత్తం 10 రకాల థీమ్స్‌తో, 5 స్థాయిలలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒక క్రమ పద్ధతిలో ఈ కార్యక్రమాలు సాగనున్నాయి. ఏప్రిల్ 2వ తేదీన గ్రామ స్థాయి కార్యక్రమాలతో ప్రారంభించి, 16వ తేదీన మండల స్థాయి, మే 2వ తేదీన నియోజకవర్గ స్థాయి, మే 22వ తేదీన జిల్లా స్థాయి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. చివరగా జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా భారీ ఎత్తున రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించి, ఈ 99 రోజుల ప్రగతిని సమీక్షించనున్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలే భాగస్వాములు కావాలన్న ఉద్దేశంతో గ్రామ సభలకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సభల్లో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరుతున్న లబ్ధిని గణాంకాలతో సహా వివరించాలని ఆదేశించారు. ముఖ్యంగా రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి అభిప్రాయాలను సేకరించి, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. సంక్షేమ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, నిజమైన అర్హులందరికీ అందుతున్నాయా లేదా అన్నది కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.



రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన విద్యా వ్యవస్థలో ప్రజా ప్రభుత్వం తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం కోసం సమీపంలోని మెడికల్ కాలేజీలతో వాటిని అనుసంధానం చేయాలని సూచించారు. దీనివల్ల నిరుపేదలకు మెరుగైన స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, వైద్య రంగంలో తెలంగాణను ఆదర్శంగా నిలబెట్టవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అట్టడుగు వర్గాల సంక్షేమంలో కీలకమైన మధ్యాహ్న భోజన పథకంపై కూడా ముఖ్యమంత్రి కీలక సూచనలు చేశారు. పాఠశాలల్లో భోజనం నాణ్యతగా ఉండటంతో పాటు, ఆ భోజనాన్ని వండి వడ్డించే ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లుల చెల్లింపులు కచ్చితంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధుల విడుదల విషయంలో జాప్యం జరగకుండా చూడటం వల్ల పథకం సమర్థవంతంగా అమలవుతుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉంటుందన్న భరోసా కల్పించాలని కలెక్టర్లను కోరారు.

తెలంగాణ సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవంతో కూడిన జీవనం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా సొంతింటి కలను నెరవేర్చడం, సన్నబియ్యం ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందించడం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అధికారుల పనితీరు కేవలం ఫైళ్లకే పరిమితం కాకుండా, ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడటమే అసలైన పురోగతి అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాప్రతినిధులు కూడా తమ నియోజకవర్గాల్లో ఈ 99 రోజుల ప్రణాళిక విజయవంతమయ్యేలా చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కలెక్టర్ల సదస్సులో మంత్రుల బృందం కూడా పాల్గొని తమ తమ శాఖల వారీగా అమలు చేయాల్సిన ప్రణాళికలపై సూచనలు చేశారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ వంటి సీనియర్లు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాల వేగం పెంచాలని కోరారు. పాలనలో పారదర్శకత ఉండాలని, అవినీతికి తావు లేకుండా అర్హులకు న్యాయం జరగాలని మంత్రులు స్పష్టం చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కలెక్టర్లు తమ జిల్లాల్లో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సవాళ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే స్పందించింది.

ప్రభుత్వ యంత్రాంగం మరియు రాజకీయ నాయకత్వం మధ్య సమన్వయ లోపం లేకుండా చూడటం ఈ యాక్షన్ ప్లాన్ ప్రధాన ఉద్దేశ్యం. జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలోని ప్రజాప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఎస్ రామకృష్ణారావు సూచించారు. ప్రతి స్థాయిలోనూ నివేదికలు సిద్ధం చేసి, పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ సెల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ 99 రోజుల కాలంలో పాలనలో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఒక సానుకూల దృక్పథం రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు చేసిందనే విషయాన్ని జూన్ 2వ తేదీన రాష్ట్ర స్థాయి సమావేశంలో బహిరంగంగా ప్రకటిస్తామని తెలిపారు.

# నిప్పుల గుండంలా హర్మూజ్

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు అంతకంతకూ ఎగసిపడుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికాలతో ముదురుతున్న వైరం నేపథ్యంలో ఇరాన్ అత్యంత సాహసోపేతమైన, ప్రమాదకరమైన నిర్ణయాన్ని తీసుకుంది. ప్రపంచ ఇంధన రవాణాకు వెన్నెముక వంటి హర్మూజ్ జలసంధిని ఇరాన్ అధికారికంగా మూసివేసింది. ఈ సముద్ర మార్గం గుండా ఏవైనా నౌకలు ప్రయాణించడానికి ప్రయత్నిస్తే వాటిని తగలబెడతామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తీవ్రస్థాయిలో హెచ్చరించింది. ఇరాన్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో అంతర్జాతీయ వాణిజ్యం ఒక్కసారిగా స్తంభించిపోయింది. హర్మూజ్ జలసంధి మూసివేతతో ఈ మార్గంలో ప్రయాణించాల్సిన సుమారు 700లకు పైగా నౌకలు సముద్రం మధ్యలోనే చిక్కుకుపోయాయి. వీటిలో 100కు పైగా భారీ కంటైనర్ షిప్స్ ఉండటం గమనార్హం. మార్చి 1వ తేదీన ఈ మార్గం నుంచి కేవలం మూడు ట్యాంకర్లు మాత్రమే బయటకు రాగా, మార్చి 2వ తేదీ నాటికి పరిస్థితి మరింత దిగజారింది. కేవలం ఒక చిన్న ట్యాంకర్, ఒక కార్గో షిప్ మాత్రమే ప్రయాణం సాగించాయని నివేదికలు చెబుతున్నాయి. ఇరాన్ సైన్యం ఈ ప్రాంతాన్ని పూర్తిగా తన గుప్పిట్లోకి తీసుకోవడంతో నౌకాయాన సంస్థలు ప్రాణభయంతో తమ ప్రయాణాలను నిలిపివేశాయి.

భౌగోళికంగా హర్మూజ్ జలసంధి పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో అనుసంధానించే అత్యంత కీలకమైన మార్గం. సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ వంటి దేశాల చమురుతో పాటు ఖతార్, యూఏఈ ఉత్పత్తి చేసే సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) ప్రపంచ మార్కెట్లకు చేరాలంటే ఇదొక్కటే ఏకైక మార్గం. ఈ మార్గం ఎంత ఇరుకైనదంటే, నౌకలు వెళ్లడానికి చాలా పరిమితమైన చానెల్స్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. అటువంటి కీలకమైన ప్రాంతాన్ని ఇరాన్ మూసివేయడం అంటే ప్రపంచ ఇంధన సరఫరా గొంతు నులమడమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



పర్షియన్ గల్ఫ్‌ను గల్ఫ్ ఆఫ్ ఓమాన్‌తో కలిపే ఈ సన్నని సముద్ర మార్గం వెడల్పు సుమారు 33 కిలోమీటర్లు మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే ముడి చమురులో దాదాపు 20 శాతం ఈ మార్గం ద్వారానే రవాణా అవుతుంది. సౌదీ అరేబియా, కువైట్, ఇరాక్, ఖతార్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు తమ ఆర్థిక వ్యవస్థకు ఆధారమైన చమురును ఇక్కడి నుంచే ఎగుమతి చేస్తాయి. ముఖ్యంగా ఆసియా మార్కెట్లకు, అందులోనూ చైనా, భారత్ వంటి దేశాలకు ఇంధనం చేరాలంటే ఈ జలసంధి సజావుగా ఉండటం అత్యంత అవసరం. అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ నివేదికల ప్రకారం, హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాలు ప్రపంచంలో చాలా తక్కువగా ఉన్నాయి. సౌదీ అరేబియా, యూఏఈ దేశాలు కొంతమేర పైప్‌లైన్ మార్గాలను వినియోగిస్తున్నప్పటికీ, మొత్తం చమురు ఎగుమతులను వాటి ద్వారా పంపడం సాధ్యం కాదు. సముద్ర మార్గం ద్వారా జరిగే రవాణాతో పోలిస్తే పైప్‌లైన్ల సామర్థ్యం చాలా తక్కువ. ఇప్పుడు ఇరాన్ ఈ మార్గాన్ని మూసివేయడంతో ప్రపంచ చమురు అవసరాలు తీరక దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలే ప్రమాదం పొంచి ఉంది. చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 1980లలో జరిగిన ఇరాన్‌ఇరాక్ 'ట్యాంకర్ యుద్ధం' తర్వాత ఇంతటి భారీ స్థాయిలో హర్మూజ్ మూసివేత ఎప్పుడూ జరగలేదు. అయితే గత ఫిబ్రవరిలో ఇరాన్ నిర్వహించిన సైనిక విన్యాసాల సమయంలో కొంతకాలం ఆంక్షలు విధించడంతోనే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఒక్కసారిగా 6 శాతం పెరిగాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో మూసివేత ప్రకటించడంతో చమురు ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయంగా కనిపిస్తోంది. ఇది ప్రపంచవ్యాప్త ద్రవ్యోల్బణానికి దారితీసి, సామాన్యుడిపై మోయలేని భారాన్ని మోపే అవకాశం ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలు సాగిస్తున్న యుద్ధ వాతావరణం ఇప్పుడు అంతర్జాతీయ చమురు సరఫరా వ్యవస్థను కుదిపేస్తోంది. ఇరాన్ మరియు ఒమన్ దేశాల మధ్య ఉండే ఈ జలసంధి ప్రపంచంలోనే అత్యంత బిజీగా ఉండే చమురు రవాణా మార్గం. రోజువారీ ఇంధన అవసరాల్లో ఐదో వంతు వాటాను కలిగి ఉన్న ఈ మార్గం మూతపడటంతో వాణిజ్య యుద్ధం కాస్తా ఇంధన యుద్ధంగా మారింది. యుద్ధం కారణంగా సరఫరా గొలుసు దెబ్బతింటే, అది కేవలం ఆసియా దేశాలకే కాకుండా యూరప్, అమెరికా దేశాల పారిశ్రామిక రంగాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఇరాన్ సైన్యం జరిపిన హెచ్చరికలు నౌకాయాన రంగంలో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఐఆర్‌జీసీ తన అధికారిక ప్రకటనలో నౌకలను తగలబెడతామని చెప్పడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పాశ్చాత్య దేశాలు మండిపడుతున్నాయి. అయినప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా ఏ దేశం కూడా తమ నౌకలను ఆ మార్గంలోకి పంపే సాహసం చేయడం లేదు. దీనివల్ల సముద్రంలో చిక్కుకుపోయిన వందలాది నౌకల్లోని సరుకు పాడయ్యే ప్రమాదం ఉండటమే కాకుండా, విదేశీ వాణిజ్యం భారీగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఈ సంక్షోభం నుంచి బయటపడటానికి ఐక్యరాజ్యసమితి, ఇతర అగ్రరాజ్యాలు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. చమురు సరఫరా నిలిచిపోతే ప్రపంచవ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభిస్తుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరుగుతాయి. ఇప్పటికే రష్యాఉక్రెయిన్ యుద్ధంతో అతలాకుతలమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ఇప్పుడు ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం కోలుకోలేని దెబ్బ కానుంది.

# అమెరికా–ఇరాన్ మధ్య భీకర దాడులు

**విశాలభారతి, అంతర్జాతీయం:**

ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు, మిస్సైళ్లు, డ్రోన్ల లాంచ్ ప్యాడ్లు మరియు కీలక వైమానిక స్థావరాలపై ఈ విమానాలు నిప్పుల వర్షం కురిపించాయి. ముఖ్యంగా బాలిస్టిక్ మిస్సైల్ తయారీ మరియు నిల్వ కేంద్రాలను నామరూపాలు లేకుండా చేశామని అమెరికా స్పష్టం చేసింది. తమ దేశ ప్రయోజనాలకు, సైనిక స్థావరాలకు ఇరాన్ నుంచి పొంచి ఉన్న ముప్పును నివారించేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా తన ఎక్స్ వేదికగా వెల్లడించింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా తీవ్రస్థాయిలో ప్రతిఘటించింది. బహ్రెయిన్‌లోని అమెరికాకు చెందిన కీలకమైన 'షేక్ ఈసా' వైమానిక స్థావరంపై ఇరాన్ ఐఆర్‌జీసీ భీకర దాడులు చేసింది. సుమారు 20 డ్రోన్లు, 3 మిస్సైళ్లతో ఆ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు అల్ జజీరా మీడియా సంస్థ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఈ దాడిలో అమెరికా స్థావరంలోని ప్రధాన కమాండ్ కంట్రోల్ భవనం కుప్పకూలిందని సమాచారం. అమెరికా మరియు ఇజ్రాయెల్ దాడులు కొనసాగినంత కాలం తాము వెనక్కి తగ్గేదే లేదని ఇరాన్ రాయబారి అమీర్ సయ్యిద్ ఇరావని అంతర్జాతీయ వేదికపై స్పష్టం చేశారు.

మరోవైపు ఇజ్రాయెల్ సరిహద్దుల్లోనూ యుద్ధం ముదిరింది. లెబనాన్‌కు చెందిన హిజ్బుల్లా మిలిటెంట్లు ఇజ్రాయెల్‌లోని రమత్ డేవిడ్ వైమానిక స్థావరంపై డ్రోన్ల దాడికి దిగారు. కమాండ్ సెంటర్లపై డ్రోన్లు పడటంతో భారీ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ సైన్యం బీరుట్ నగరంలోని హిజ్బుల్లా అనుబంధ టీవీ ఛానల్ 'అల్ మనార్' భవనాన్ని ధ్వంసం చేసింది. విచిత్రమేమిటంటే, భవనం దెబ్బతిన్న నిమిషాల్లోనే ఆ ఛానల్ తిరిగి ప్రసారాలను ప్రారంభించడం గమనార్హం. ఈ దాడుల పరంపర పశ్చిమాసియాలో శాంతిని పూర్తిగా కనుమరుగు చేస్తోంది.

ఈ ఘర్షణల మధ్య ఇజ్రాయెల్ సైన్యం ఒక భారీ విజయాన్ని అందుకుంది. మార్చి 2వ తేదీ అర్ధరాత్రి బీరుట్‌పై నిర్వహించిన ఆకస్మిక దాడిలో హిజ్బుల్లా నిఘా విభాగం అధిపతి హుసేన్ మాక్లెద్ హతమయ్యాడని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇది హిజ్బుల్లాకు కోలుకోలేని దెబ్బ అని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ పరిణామం జరిగిన వెంటనే లెబనాన్ ప్రభుత్వం ఒక సంచలన ప్రకటన విడుదల చేసింది. తమ దేశ గడ్డపై ఇకపై హిజ్బుల్లా సైనిక కార్యకలాపాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు వెల్లడించింది. దేశ అంతర్గత భద్రత దృష్ట్యా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం ఉండటంతో అమెరికా తన పౌరుల రక్షణపై దృష్టి పెట్టింది. సౌదీ అరేబియా, బహ్రెయిన్, జోర్డాన్ దేశాలలో నివసిస్తున్న అమెరికన్ల కోసం కీలక అడ్వైజరీలను జారీ చేసింది. ఆయా దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాల్లో ఉన్న నాన్‌ఎమర్జెన్సీ విభాగాల సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వెంటనే స్వదేశానికి తిరిగి వచ్చేయాలని విదేశాంగ శాఖ ఆదేశించింది. పరిస్థితులు ఎప్పుడు ఏ మలుపు తిరుగుతాయో తెలియని తరుణంలో పౌరుల భద్రతే తమకు ప్రాధాన్యమని అగ్రరాజ్యం స్పష్టం చేసింది. ఇది యుద్ధం మరో స్థాయికి చేరుతుందనే ఆందోళనను పెంచుతోంది.

ముఖ్యంగా సౌదీ అరేబియాలో పరిస్థితులు అత్యంత ఉద్విగ్నంగా ఉన్నాయి. అక్కడ ఉన్న అమెరికా ఎంబసీపై ఇరాన్ అనుబంధ వర్గాలు దాడులు చేస్తున్న నేపథ్యంలో, పౌరులు ఎవరూ ఎంబసీకి రావొద్దని సూచించారు. ఇప్పటికే జారీ చేసిన అన్ని అపాయింట్‌మెంట్లను రద్దు చేస్తున్నట్లు సౌదీలోని అమెరికా ఎంబసీ ప్రకటించింది. మంగళవారం సౌదీలోని ఎంబసీ కార్యాలయంపై రెండు డ్రోన్లు పడ్డాయని సౌదీ రక్షణ శాఖ కూడా ధ్రువీకరించింది. యావత్ మిడిల్ ఈస్ట్ ప్రాంతం ఇప్పుడు ఒక అగ్నిగుండంలా మారిందని, ఏ క్షణంలోనైనా పూర్తిస్థాయి యుద్ధం మొదలయ్యే అవకాశం ఉందని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ కేవలం సైనిక స్థావరాలనే కాకుండా, సముద్ర మార్గాల్లోని వాణిజ్య ట్యాంకర్లను కూడా లక్ష్యంగా చేసుకుంది. పలు ముడి చమురు ట్యాంకర్లకు నిప్పు పెట్టినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించడం ప్రపంచ ఇంధన సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉంది. సముద్ర జలాల్లో అలజడి రేగడంతో అంతర్జాతీయ నౌకాయాన సంస్థలు తమ మార్గాలను మార్చుకుంటున్నాయి. ఇరాన్ ప్రతిఘటన తీవ్రత పెరగడం అమెరికా కూటమికి సవాల్‌గా మారింది. అగ్రరాజ్యం తన బాంబర్లతో ఇరాన్ గడ్డపైకి నేరుగా దాడులు చేయడం యుద్ధాన్ని సరిహద్దులు దాటించింది. ఈ దాడుల వెనుక ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య ఉన్న చిరకాల శత్రుత్వం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. హిజ్బుల్లాకు ఇరాన్ మద్దతు ఇవ్వడం, ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకోవడంతో అమెరికా రంగంలోకి దిగాల్సి వచ్చింది. పశ్చిమాసియాలోని తన మిత్రదేశాల రక్షణ కోసం అమెరికా చేస్తున్న ఈ దాడులు, ఇరాన్ సార్వభౌమాధికారానికి భంగం కలిగిస్తున్నాయని ఆ దేశం వాదిస్తోంది. ఈ వాదోపవాదాల మధ్య సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడంతో పాటు భారీ ఆస్తి నష్టం సంభవిస్తోంది. ఐక్యరాజ్యసమితి శాంతి కోసం విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ, యుద్ధరంగంలో తుపాకులు



మాత్రం గర్జిస్తూనే ఉన్నాయి. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులు మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికా తన బాంబర్లతో విరుచుకుపడుతుంటే, ఇరాన్ తన డ్రోన్ మరియు మిస్సైల్ బలగాలతో ప్రతీకారం తీర్చుకుంటోంది. లెబనాన్ వంటి దేశాలు మిలిటెంట్ గ్రూపులపై నిషేధం విధిస్తూ స్వయం రక్షణకు ప్రయత్నిస్తున్నాయి. ఈ పోరు ఎటు దారితీస్తుందో తెలియక యావత్ ప్రపంచం ఆందోళనతో గమనిస్తోంది. రాబోయే కొద్ది రోజులు పశ్చిమాసియా భవిష్యత్తును నిర్ణయించడంలో అత్యంత కీలకం కానున్నాయి.

## హోలీ పండుగ సందడి



**ముషీరాబాద్, విశాలభారతి:** పౌర్ణమిని పురస్కరించుకొని హోలీ పండుగను ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ముషీరాబాద్ పరిధిలోని రాంనగర్ లలిత నగర్ విద్యానగర్ తదితర ప్రాంతాల్లో చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోలీ ఆడారు. రంగులు చల్లుకొని స్వీట్లు తినిపించుకొని చిన్నపిల్లల కేరింతల మధ్య సంబరాలు జరుపుకొని ఐక్యతకు ప్రతీకగా కాలనీ బస్తీవాసులు నిలిచారు.

## హోలీ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి



**సికింద్రాబాద్, విశాలభారతి:** బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నివాసంలో హోలీ పండుగ ను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి రామచంద్రరావును కలిసి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి కొంత సేపు రంగులు చల్లుకొని, స్వీట్లు తినిపించుకొని హోలీ పండుగ సందడి చేశారు. ఈ సందర్భంగా కార్తీక రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఇంట ఆనంద కాంతులు విరజిమ్మాలని ఆకాంక్షిస్తూ... హిందూ కుటుంబ సభ్యులందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పండగ పూట వ్యక్తి దుర్మరణం

**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచ పట్టణం నవభారత్ సెంటర్ జాతీయ రహదారిపై మంగళవారం హోలీ పండగ రోజు రెండు టూ వీలర్స్ ఎదురెదురగా ఢీ కొనడంతో నవభారత్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మహేష్ (35)అనే వ్యక్తికి తీవ్ర గాయాలవడంతో కొత్తగుడెం ప్రైవెట్ హాస్పిటల్ కు తరలించగా మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్ట్ మార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మహేష్‌కు ఒక పాప, ఒక బాబు వున్నట్లు సమాచారం. యాక్సిడెంట్ అయిన ప్రదేశంలో పోలీస్ ట్రాఫిక్ బాక్స్ వుండటం వల్లే ఇలాంటి ప్రమాదాలు తరుచూ ఆ ప్రదేశంలో జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

# గల్ఫ్ నుంచి స్వదేశానికి భారతీయులు

- ఇజ్రాయెల్-అమెరికా యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయుల తరలింపు ప్రారంభం
- అబుదాబి నుంచి కొచ్చికి చేరుకున్న వంద మంది ప్రయాణికులు
- ఉద్రిక్తతలతో కొచ్చి నుంచి మధ్యప్రాచ్యానికి 31 విమాన సర్వీసులు రద్దు
- ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశ ఎయిర్‌లైన్స్ కీలక నిర్ణయం
- గల్ఫ్ విమానాశ్రయాల్లో అనిశ్చితి.. భారతీయుల్లో ఆందోళన
- స్వదేశానికి సురక్షితంగా చేరవేయడానికి విమానయాన సంస్థల చర్యలు



**విశాలభారతి, జాతీయం:**

మధ్యప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధ మేఘాలు ప్రపంచవ్యాప్తంగా పెను ఆందోళనకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్, అమెరికా బలగాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు గల్ఫ్ దేశాల్లోని విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ యుద్ధ పరిస్థితుల వల్ల గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వేలాది మంది భారతీయులు ఇప్పుడు భయాందోళనల మధ్య స్వదేశానికి తిరుగుపయనం అవుతున్నారు. ఉపాధి కోసం వెళ్ళిన వారు, పర్యాటకులు ఒకవైపు.. నిత్యావసరాలు మరియు రవాణా నిలిచిపోవడంతో అనిశ్చితిలో ఉన్న ప్రయాణికులు మరోవైపు.. వెరసి గల్ఫ్ విమానాశ్రయాలు ఇప్పుడు కిక్కిరిసిపోతున్నాయి. తాజా పరిణామాల్లో భాగంగా అబుదాబి అంతర్జాతీయ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన సుమారు వంద మంది భారతీయులు ఎట్టకేలకు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. ఎతిహాద్ ఎయిర్‌వేస్ సంస్థకు చెందిన ప్రత్యేక విమానం వీరిని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేర్చింది. రోజుల తరబడి విమానాశ్రయ ప్రాంగణాల్లోనే పడిగాపులు కాసిన తమ వారు సురక్షితంగా ఇంటికి చేరుకోవడంతో కేరళలోని వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, యుద్ధం మరింత ముదిరితే మిగిలిన వారి పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

యుద్ధం కారణంగా గగనతల ఆంక్షలు పెరగడం, భద్రతాపరమైన ముప్పు పొంచి ఉండటంతో విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం పడింది. కేవలం కొచ్చి విమానాశ్రయం నుంచే మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లాల్సిన సుమారు 31 విమాన సర్వీసులు ఒక్కసారిగా రద్దయ్యాయి. ఇది వేలాది మంది ప్రయాణికుల ప్రణాళికలను తలకిందులు చేసింది. ముఖ్యంగా కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉండటంతో కొచ్చి విమానాశ్రయం వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు తమ ప్రయాణం ఎప్పుడు ఉంటుందో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

భారతదేశానికి చెందిన ప్రముఖ విమానయాన సంస్థలు కూడా భద్రత దృష్ట్యా కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశ ఎయిర్ లైన్స్ వంటి సంస్థలు పలు విమాన సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించాయి. గగనతలంలో క్షిపణి దాడులు లేదా యుద్ధ విమానాల కదలికలు పెరగడం వల్ల ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థలు వెల్లడించాయి. దీనివల్ల గల్ఫ్ దేశాలకు రాకపోకలు సాగించే వ్యాపారవేత్తలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

యుద్ధ క్షేత్రానికి సమీపంలో ఉన్న గల్ఫ్ దేశాల్లోని భారతీయులు ఇప్పుడు ప్రాణభయంతో వణికిపోతున్నారు. క్షిపణి దాడుల హెచ్చరికలు, సైనిక కదలికల వార్తలు వారిని నిద్రలేకుండా చేస్తున్నాయి. ఒకవైపు విమానాల రద్దు, మరోవైపు పెరుగుతున్న టిక్కెట్ ధరలు సామాన్యుడిని మరింత కుంగదీస్తున్నాయి. అత్యవసరంగా స్వదేశానికి రావాలనుకునే వారికి విమాన సంస్థల రద్దు నిర్ణయాలు పిడుగులాంటి వార్తగా మారాయి. ఇప్పటికే అక్కడ ఉన్న భారత రాయబార కార్యాలయాలు నిరంతరం ప్రయాణికులతో సంప్రదింపులు జరుపుతూ వారికి భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాయి.

అబుదాబి నుంచి కొచ్చికి చేరుకున్న ప్రయాణికులు అక్కడి భయానక పరిస్థితులను వివరిస్తున్నారు. విమానాశ్రయాల్లో గంటల తరబడి వేచి చూడాల్సి రావడం, విమాన రాకపోకల గురించి సరైన సమాచారం అందకపోవడం వల్ల కలిగే మానసిక ఒత్తిడి వర్ణనాతీతమని వారు పేర్కొంటున్నారు. యుద్ధ వాతావరణం వల్ల రవాణా వ్యవస్థ స్తంభించడంతో ఆహారం, ఇతర వసతుల కోసం కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలతో స్వదేశానికి చేరుకోవడం ఒక పునర్జన్మలా భావిస్తున్నామని వారు కన్నీటి పర్యంతమయ్యారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఈ ఉద్రిక్తతల ప్రభావం కేవలం ప్రయాణాలపైనే కాకుండా అంతర్జాతీయంగా చమురు ధరలపై కూడా పడే అవకాశం ఉంది. దీనివల్ల విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులు పెరిగి టిక్కెట్ ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుతున్నాయి. ఈ క్లిష్ట సమయంలో భారత ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రత్యేక విమానాలను నడపాలని ప్రవాస భారతీయులు కోరుతున్నారు. గతంలో ఉక్రెయిన్, సూడాన్ వంటి దేశాల్లో చిక్కుకున్న వారిని తరలించిన విధంగానే 'వందే భారత్' తరహా ఆపరేషన్ నిర్వహించాలని విన్నవించుకుంటున్నారు.

ప్రస్తుతానికి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వంటి సంస్థలు ప్రయాణికులకు రీషెడ్యూలింగ్ లేదా పూర్తి రిఫండ్ వంటి వెసులుబాట్లు కల్పిస్తున్నాయి. అయితే, అనిశ్చితి కొనసాగుతున్నంత కాలం ఈ సర్వీసులు ఎప్పుడు పునరుద్ధరించబడతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇండిగో, ఆకాశ ఎయిర్ లైన్స్ సంస్థలు కూడా తమ ప్రయాణికులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తున్నాయి. యుద్ధం ప్రభావిత ప్రాంతాల మీదుగా విమానాలు వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వెతకడం వల్ల ప్రయాణ సమయం కూడా భారీగా పెరుగుతోంది. కొచ్చి విమానాశ్రయ అధికారుల సమాచారం ప్రకారం, గల్ఫ్ దేశాలకు వెళ్లే ప్రయాణికులు విమానాశ్రయానికి వచ్చే ముందే తమ సర్వీసుల స్థితిగతులను తనిఖీ చేసుకోవాలని సూచిస్తున్నారు. రద్దయిన విమానాల ప్రయాణికుల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. ఉద్రిక్తతలు సద్దుమణిగే వరకు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యుద్ధం తీవ్రత పెరిగితే రాబోయే రోజుల్లో మరిన్ని సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనడమే ప్రపంచానికి, ముఖ్యంగా అక్కడ నివసిస్తున్న లక్షలాది మంది భారతీయులకు మేలు చేస్తుంది. యుద్ధం ఎవరికీ మేలు చేయదని, అది కేవలం విధ్వంసాన్ని, అభద్రతను మాత్రమే మిగులుస్తుందని ప్రస్తుత పరిస్థితులు నిరూపిస్తున్నాయి. స్వదేశానికి చేరుకుంటున్న ప్రయాణికుల ముఖాల్లో ఆనందం కనిపిస్తున్నా, ఇంకా అక్కడ చిక్కుకున్న వారి భవిష్యత్తుపై ఆందోళన మాత్రం కొనసాగుతూనే ఉంది. భారత ప్రభుత్వం, విమానయాన సంస్థలు సమన్వయంతో వ్యవహరించి, ప్రతి భారతీయుడిని సురక్షితంగా వెనక్కి తీసుకువస్తాయని ఆశిద్దాం.

# ఖజానా ఖాళీ.. పార్టీకి వేల కోట్లా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పాలక కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదిరింది. రాష్ట్ర ఖజానాపై స్పష్టత ఇవ్వాలంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన బహిరంగ లేఖ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ఎన్నికల వేళ ఆచరణకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు నిధుల కొరత సాకుతో ప్రజలను మోసం చేస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై వాస్తవాలను దాచకుండా, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే పూర్తి వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని ప్రజల ముందు ఉంచాలని ఆయన ఈ లేఖ ద్వారా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆరు గ్యారంటీలతో పాటు సుమారు 420 హామీలను ఇచ్చి అధికార పీఠాన్ని అధిరోహించిన కాంగ్రెస్, ఇప్పుడు వాటి అమలు దగ్గరకు వచ్చేసరికి వెనకడుగు వేస్తోందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఖజానా ఖాళీ అయిందని, మట్టి కుండలే మిగిలాయని వ్యంగ్యంగా మాట్లాడటం ద్వారా ముఖ్యమంత్రి బాధ్యతల నుండి తప్పుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను విస్మరించడం ప్రజాస్వామ్యానికి విఘాతమని ఆయన పేర్కొన్నారు.

లేఖలో కిషన్ రెడ్డి ఒక కీలకమైన అంశాన్ని ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రిపై విరుచుకుపడ్డారు. ఒకవైపు రాష్ట్రంలో నిధులు లేవని చెబుతూనే, మరోవైపు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి అవసరమైతే రూ.1,000 కోట్లు ఇస్తామంటూ రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబం కోసం రాష్ట్ర సొమ్మును మళ్లించడానికి సిద్ధపడటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చూస్తుంటే "రాష్ట్ర ఖజానా నిల్ కాంగ్రెస్ నాయకుల జేబులు ఫుల్" అనే చందంగా సాగుతోందని ఎద్దేవా చేశారు. ప్రజల సంక్షేమం కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమంత్రికి ప్రాధాన్యతగా మారాయని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి పట్ల కేంద్రంలోని



నరేంద్ర మోదీ ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధిని కిషన్ రెడ్డి అంకెలతో సహా వివరించారు. 2014 నుంచి నేటి వరకు ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని, సుమారు రూ. 12 లక్షల కోట్ల భారీ నిధులను వివిధ రూపాల్లో కేటాయించిందని గుర్తు చేశారు. కేవలం రాజకీయ విమర్శలు చేయడం మానేసి, కేంద్రం అందిస్తున్న సహకారాన్ని గమనించాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్రం వాటా ఏంటో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, ఆ నిధుల వినియోగంపై కూడా ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్రం అందించిన నిధుల వివరాలను కిషన్ రెడ్డి కూలంకషంగా లేఖలో పొందుపరిచారు. అందులో రూ. 2.5 లక్షల కోట్ల పన్నుల వాటా, రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణం, రూ. 36 వేల కోట్లకు పైగా రైల్వే బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మరో రూ. 50 వేల కోట్ల విలువైన రైల్వే పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఉపాధి హామీ కింద రూ. 40 వేల కోట్లు, ఉచిత బియ్యం పంపిణీకి రూ. 50 వేల కోట్లు ఇలా ప్రతి రంగానికి మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన గణాంకాలను ఏకరువు పెట్టారు.

గ్రామీణ మరియు పట్టణ స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘాల సిఫారసుల మేరకు రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు అందాయని కేంద్రమంత్రి తెలిపారు. విద్యుత్ ప్రాజెక్టులకు రూ. 12 వేల కోట్లు, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాల్లోకి రూ. 14 వేల కోట్లు నేరుగా జమ అయ్యాయని గుర్తు చేశారు. ముఖ్యంగా రైతులకు ఎరువుల సబ్సిడీ కోసం ఏకంగా రూ. 80 వేల కోట్లకు పైగా నిధులను కేంద్రం వెచ్చించిందని ఆయన వివరించారు. ఇన్ని నిధులు అందుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీ అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన విమర్శించారు.

విద్య, క్రీడలు, ఆరోగ్య రంగాలకు కూడా కేంద్రం భారీగా నిధులు మంజూరు చేసిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. విద్యా రంగానికి రూ. 21 వేల కోట్లు, ఆరోగ్య సంరక్షణ కోసం రూ. 9 వేల కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇంత మొత్తంలో కేంద్రం నుండి సహకారం అందుతున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం కావడం వెనుక కారణాలను విశ్లేషించుకోవాలని సూచించారు. నిధుల మళ్లింపు జరుగుతోందా లేదా పరిపాలనలో లోపాలు ఉన్నాయా అనే విషయాన్ని ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల కుప్పగా మారిందని ఒకవైపు ప్రచారం చేస్తూనే, మరోవైపు అనవసర ఖర్చులు చేయడం సరికాదని కిషన్ రెడ్డి హితవు పలికారు. ప్రజలపై పన్నుల భారం వేయకుండా, కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఆరు గ్యారంటీల అమలు కోసం బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు ఎక్కడ ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. శ్వేతపత్రం ద్వారా రాష్ట్రం వద్ద ఉన్న నగదు నిల్వలు, అప్పులు, చెల్లించాల్సిన బకాయిల వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నాయని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంతో ఘర్షణాత్మక వైఖరి వీడి, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తమ వైఫల్యాలను కేంద్రం మీదకు నెట్టేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల పక్షాన తాము ఈ లేఖ రాస్తున్నామని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలని డిమాండ్ చేశారు. నిధుల విషయంలో పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజల్లో అనుమానాలు తలెత్తుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

# ఇరాన్ కాళ్ల బేరానికి వస్తోంది

**మొదటిపేజీ తరువాయి**

చర్చల ప్రస్తావన తీసుకురావడం అంతర్జాతీయ వేదికపై ఆసక్తికర చర్చకు దారితీసింది. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఇరాన్ ప్రతిపాదనను తేలికగా కొట్టిపారేశారు. ఇరాన్ చర్చల గురించి ఆలోచించే సరికి చాలా ఆలస్యం జరిగిపోయిందని, అగ్రరాజ్యం దెబ్బకు ఆ దేశం ఇప్పటికే తన సర్వస్వాన్ని కోల్పోయిందని ఆయన ఘాటుగా స్పందించారు. ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు అద్దం పడుతున్నాయి.

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహీ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఈ ప్రతిస్పందన వ్యక్తం చేశారు. ఇరాన్ ఆత్మగౌరవానికి అమెరికా విలువనిస్తే తాము చర్చలకు సిద్ధమని ఇలాహీ పేర్కొన్నారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ, "ఇరాన్ నాయకత్వం, గగనతల రక్షణ వ్యవస్థ, వాయుసేన, నౌకాదళం అన్నీ నాశనమైపోయాయి. ఇప్పుడు వారు చర్చల గురించి మాట్లాడుతున్నారు. కానీ నేను చెబుతున్నాను.. ఇప్పటికే సమయం మించిపోయింది" అంటూ ఎద్దేవా చేశారు. ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీసిన తర్వాత ఇక రాయబారాలకు తావులేదన్న సంకేతాన్ని ఆయన బలంగా పంపారు.

మరోవైపు, ఇరాన్‌పై చేపట్టిన సైనిక చర్యలకు సంబంధించి అధ్యక్షుడు ట్రంప్ అమెరికా కాంగ్రెస్‌కు ఒక అధికారిక లేఖను రాశారు. ఈ దాడులను తాను ఎందుకు ఆదేశించాల్సి వచ్చిందో ఆయన సుదీర్ఘంగా వివరించారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ దాడులు అమెరికా జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసమేనని ఆయన సమర్థించుకున్నారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి గుండా జరిగే సముద్ర రవాణా మరియు అంతర్జాతీయ వాణిజ్యానికి ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇది అమెరికా మిత్రదేశాల రక్షణకు అనివార్యమని ఆయన అభిప్రాయపడ్డారు.

పశ్చిమాసియా ప్రాంతంలో అమెరికా మిత్రదేశమైన ఇజ్రాయెల్ భద్రత కూడా ఈ దాడులకు ఒక ప్రధాన కారణమని ట్రంప్ లేఖలో ప్రస్తావించారు. ఇరాన్ వద్ద ఉన్న బాలిస్టిక్ మిస్సైల్ యూనిట్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు మరియు ఆ దేశ యుద్ధ నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. అమెరికా సైనికుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నందున, ముందస్తు జాగ్రత్తగానే ఈ సైనిక చర్యను చేపట్టినట్లు ఆయన వివరించారు. ఇరాన్ యొక్క దూకుడును అణచివేయడం ద్వారా ప్రాంతీయ సుస్థిరతను కాపాడవచ్చని అమెరికా భావిస్తోంది.

అయితే, ఈ యుద్ధంపై అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో ట్రంప్ ఒక కీలక వివరణ ఇచ్చారు. ఇరాన్‌పై కేవలం వైమానిక, నౌకాదళ దాడులు మాత్రమే జరుగుతాయని, భూతల దాడులు చేసే ఉద్దేశం తమకు లేదని కాంగ్రెస్‌కు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇరాన్ నుంచి ఎదురయ్యే ముప్పును తగ్గించడమే తమ ప్రాథమిక లక్ష్యమని, అందుకే వారి ఆయుధ సంపత్తిని లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారు. దాడుల సమయంలో పౌర నష్టం జరగకుండా, వీలైనంత తక్కువ ప్రాణనష్టంతో ఆపరేషన్ నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని లేఖలో పేర్కొన్నారు.



మరోపక్క, రణరంగంలో ఇజ్రాయెల్ దళాలు కీలక విజయాన్ని ప్రకటించాయి. మంగళవారం నిర్వహించిన వైమానిక దాడుల్లో ఇరాన్‌కు చెందిన ఒక సీనియర్ సైనిక కమాండర్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. అయితే, ఆ కమాండర్ పేరును మాత్రం ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు. ఇది ఇరాన్ సైనిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుందని ఇజ్రాయెల్ భావిస్తోంది. ఈ పరిణామంతో ఇరాన్ తన ప్రతీకార చర్యలను మరింత ఉద్ధృతం చేసే అవకాశం ఉందని రక్షణ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

గత శనివారం అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో 150 మందికి పైగా పాఠశాల విద్యార్థులు మరణించడం ఇరాన్‌లో పెను దుమారాన్ని రేపింది. మంగళవారం ఈ చిన్నారుల అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. వేలాది మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరాన్ ప్రభుత్వ మీడియా ఈ దృశ్యాలను విస్తృతంగా ప్రసారం చేస్తూ, ప్రజల్లో జాతీయవాదాన్ని రగిలిస్తోంది. అమాయక పిల్లలను పొట్టనబెట్టుకున్న 'శత్రువు'ను క్షమించబోమని ఇరాన్ మీడియా హెచ్చరికలు జారీ చేస్తోంది.

ఈ పరిణామం రాజకీయంగా ఇరాన్ పాలకులకు కొంత కలిసివచ్చే అంశంగా కనిపిస్తోంది. యుద్ధం మొదలైతే ప్రజలు ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి వ్యతిరేకంగా తిరగబడతారని, ప్రభుత్వం కూలిపోతుందని అధ్యక్షుడు ట్రంప్ వేసిన అంచనాలు తలకిందులవుతున్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. చిన్నారుల మరణంతో జనం ప్రభుత్వంపై కోపం పెంచుకోకుండా, అమెరికాపై ద్వేషంతో ఏకమవుతున్నారు. బాహ్య శత్రువును ఎదుర్కోవడంలో భాగంగా ప్రజలు తమ నాయకత్వం వైపు నిలబడటం ట్రంప్ వ్యూహకర్తలకు విస్మయం కలిగిస్తోంది. యుద్ధం నాలుగో రోజుకు చేరుకున్నా ఉధృతి ఏమాత్రం తగ్గలేదు. మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులను ప్రయోగిస్తోంది. అలాగే ఇజ్రాయెల్ భూభాగంపైనా దాడులు కొనసాగిస్తోంది. దీనికి ప్రతిగా అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్‌లోని వ్యూహాత్మక ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. ఆకాశమంతా దట్టమైన పొగతో, పేలుళ్ల శబ్దాలతో దద్దరిల్లుతోంది. ఇరు పక్షాలు వెనక్కి తగ్గకపోవడంతో ఈ ఘర్షణ ఎటు దారితీస్తుందోనని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

# కన్నీటి సంద్రమైన ఇరాన్

**మొదటిపేజీ తరువాయి**

ఫిబ్రవరి 28న జరిగిన దాడిలో సుమారు 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థినులే ఎక్కువగా ఉన్న ఆ భవనంపై బాంబులు కురవడంతో, చిన్నారులు తప్పించుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. పాఠశాల ప్రాంగణం మొత్తం భారీ శబ్దాలతో దద్దరిల్లి, భవనంలోని ఎక్కువ భాగం పేకమేడలా కూలిపోయింది. మృతదేహాలు శిథిలాల కింద ఇరుక్కుపోవడంతో, రెస్క్యూ బృందాలు గంటల తరబడి శ్రమించి వాటిని వెలికితీయాల్సి వచ్చింది. ఆ చిన్నారి దేహాలను చూసి సహాయక సిబ్బంది సైతం కన్నీరు ఆపుకోలేకపోయారు. మంగళవారం నాడు మరణించిన 160 మంది బాలికలకు సామూహికంగా అంత్యక్రియలు



నిర్వహించారు. ఒకే వరుసలో పేర్చిన శవపేటికలను చూసి ఆ ప్రాంతమంతా రోదనలతో మిన్నంటింది. తమ కళ్ల ముందే ఆడుకుంటూ బడికి వెళ్లిన బిడ్డలు, ఇలా విగతజీవులుగా తిరిగి రావడం తల్లిదండ్రులకు కోలుకోలేని దెబ్బగా మారింది. ఊరేగింపుగా వెళ్తున్న శవపేటికల వెనుక వేలాది మంది ప్రజలు కన్నీటి పర్యంతమవుతూ సాగారు. ప్రార్థనల మధ్య సాగిన ఈ అంత్యక్రియల దృశ్యాలు ఇరాన్ అంతటా పెను విషాదాన్ని నింపాయి. ఒక్కో శవపేటికపై ఆ బిడ్డల పేర్లు రాసి ఉన్న తీరు చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది.

ఈ ఘటనతో మినాబ్ నగరంలో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. అంత్యక్రియల సందర్భంగా వ్యాపార సంస్థలు, మార్కెట్లను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. నగరం మొత్తం నల్ల జెండాలతో నిండిపోయింది. ఇది కేవలం ఒక నగరం ఎదుర్కొంటున్న బాధ కాదు, మొత్తం ఇరాన్ దేశమే అనుభవిస్తున్న నరకయాతన అని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల వంటి సున్నితమైన ప్రాంతాలపై దాడులు చేయడం యుద్ధ నీతికే విరుద్ధమని ప్రపంచ దేశాల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమాయక చిన్నారులు యుద్ధానికి బలి కావడం సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే అంశమని మానవ హక్కుల సంఘాలు గొంతెత్తుతున్నాయి.

ఇరాన్ ఇప్పటికే రాజకీయంగా, సైనికంగా తీవ్ర సంక్షోభంలో ఉంది. సుప్రీం లీడర్ ఖమేనీ మరణవార్త ఆ దేశాన్ని కుంగదీయగా, కీలకమైన ఉన్నతాధికారులను ఇజ్రాయెల్ వరుస దాడుల్లో హతం చేయడం భద్రతా వ్యవస్థను దెబ్బతీసింది. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తున్నప్పటికీ, అంతర్గతంగా మాత్రం ఆ దేశం తీవ్రమైన ప్రాణ నష్టాన్ని చవిచూస్తోంది. ఒకవైపు రాజకీయ అనిశ్చితి, మరోవైపు నిరంతరం భయపెట్టే యుద్ధ విమానాల మోత మధ్య సామాన్య ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాలపై దాడి జరగడం ఇరాన్ ధైర్యాన్ని మరింతగా దెబ్బతీసింది.

యుద్ధం అనేది కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా, నివాస ప్రాంతాలకు, పాఠశాలలకు పాకడం అత్యంత ప్రమాదకర పరిణామం. మినాబ్ పాఠశాల భవనం ఇప్పుడు శిథిలాల కుప్పగా మారి, అక్కడ జరిగిన భీభత్సాన్ని కళ్లకు కడుతోంది. చిన్నారుల పుస్తకాలు, స్కూల్ బ్యాగులు రక్తంతో తడిసి శిథిలాల మధ్య పడి ఉండటం చూస్తుంటే, యుద్ధోన్మాదం ఎంతటి క్రూరత్వానికి దారి తీస్తుందో అర్థమవుతోంది. విద్యార్థినుల తల్లిదండ్రులు తమ బిడ్డల జ్ఞాపకాలతో పాఠశాల వద్దకు వచ్చి విలపిస్తున్న తీరు చూసి చుట్టుపక్కల వారు కూడా చలించిపోతున్నారు.

అంతర్జాతీయ సమాజం ఈ దారుణాన్ని ఖండిస్తున్నప్పటికీ, యుద్ధ మేఘాలు మాత్రం విడిపోవడం లేదు. ఇజ్రాయెల్ తన రక్షణ కోసమే దాడులు చేస్తున్నామని వాదిస్తుంటే, ఇరాన్ మాత్రం తమపై జరుగుతున్న ఆకృత్యాలకు ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిస్తోంది. ఈ రెండు దేశాల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరులో సామాన్యులు, ముఖ్యంగా చిన్నారులు బలిపశువులుగా మారుతున్నారు. మినాబ్ ఘటన తర్వాత ఇరాన్‌లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. ఇజ్రాయెల్ సైనిక చర్యలను తక్షణం అడ్డుకోవాలని ఆ దేశం ఐక్యరాజ్యసమితిని కోరుతోంది. ముఖ్యంగా ఈ దాడిలో మరణించిన వారిలో ప్రాథమిక స్థాయి విద్యార్థినులే అధికంగా ఉండటం మరింత విషాదకరం. దేశ భవిష్యత్తుగా ఎదగాల్సిన ఆ మొగ్గలు వికసించక ముందే తుంచబడ్డాయి. అంత్యక్రియల వేళ ఇరాన్ అంతటా నిర్వహించిన సంతాప సభల్లో లక్షలాది మంది పాల్గొని నివాళులర్పించారు. మతగురువులు, నాయకులు ఈ దారుణాన్ని మానవజాతిపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఆ చిన్నారి శవపేటికలను మోస్తున్న తండ్రుల ఆవేదనను చూసి ప్రపంచ మీడియా సైతం నివ్వెరపోయింది. ఇరాన్ చరిత్రలో ఇదొక నల్లని రోజుగా మిగిలిపోతుందని మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ తన పౌరులకు రక్షణ కల్పించడంలో విఫలమవుతోందనే విమర్శలు కూడా వస్తున్నాయి. గగనతల రక్షణ వ్యవస్థలను పటిష్టం చేయడంలో ఉన్న వైఫల్యాల వల్లనే ఇజ్రాయెల్ విమానాలు నివాస ప్రాంతాల వరకు రాగలుగుతున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే, అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఇజ్రాయెల్ దాడులను అడ్డుకోవడం ఇరాన్‌కు కత్తిమీద సాములా మారింది.

# ఎమ్మెల్సీ కవిత అరెస్టు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నగర శివార్లలోని నార్సింగి ప్రాంతం శనివారం రణరంగంగా మారింది. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. స్థానికులు, జాగృతి కార్యకర్తలతో కలిసి ఆమె నార్సింగిలోని శ్రీ ఆదిత్య లగ్జరీ అపార్ట్‌మెంట్స్ నిర్మాణ ప్రాంతం వద్ద బైఠాయించారు. నది గర్భాన్ని కబ్జా చేసి చేపట్టిన ఈ నిర్మాణాలపై ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందని ఆమె నిలదీశారు. అధికారుల తీరుకు నిరసనగా ప్లకార్డులు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు.

నార్సింగిలో మూసీ నదిని ఆక్రమించి నిర్మిస్తున్న విలాసవంతమైన అపార్ట్‌మెంట్లను తక్షణమే కూల్చివేయాలని కవిత డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను కూల్చివేయడానికి బుల్డోజర్లను పంపే హైడ్రా యంత్రాంగానికి, ఈ భారీ రియల్ ఎస్టేట్ వెంచర్లు ఎందుకు కనిపించడం లేదని ఆమె ప్రశ్నించారు. సామాన్యుడి సొంతింటి కలపై దెబ్బకొట్టే ప్రభుత్వం, బడా వ్యాపారవేత్తల అక్రమ కట్టడాలకు వంతపాడుతోందని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకునే వరకు లేదా హైడ్రా బుల్డోజర్లు ఇక్కడికి వచ్చే వరకు తాను ధర్నా విరమించేది లేదని కవిత స్పష్టం చేయడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువులు, నాలాల ఆక్రమణలపై 'జాగృతి జనంబాట' పేరుతో తాము అనేక ఫిర్యాదులు చేశామని కవిత గుర్తు చేశారు. అనేక నీటి వనరులను ఆక్రమించి కడుతున్న భవనాల వివరాలను ఆధారాలతో సహా ప్రభుత్వానికి సమర్పించినా, ఇప్పటి వరకు ఒక్క అక్రమ కట్టడంపై కూడా చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించారు. ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణదారులకు రక్షణ కల్పిస్తోందని ఆమె మండిపడ్డారు. ఈ వివక్షను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే వీటికి సమాధానం చెబుతారని హెచ్చరించారు.



ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో సుమారు 600 మంది పేదల ఇళ్లను ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిందని, కానీ నార్సింగి వంటి ప్రాంతాల్లో నదిని మింగేస్తున్నా అధికారులు కళ్లు మూసుకున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి పేదవాడిపైనే ప్రతాపం చూపడం తెలుసని, బడా రియల్టర్ల జోలికి వెళ్లడానికి వణుకు పుడుతోందని ఎద్దేవా చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో దాదాపు 20 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ వాసులను ఇబ్బంది పెడుతున్నారని, ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆమె అభివర్ణించారు. సామాన్యులను భయభ్రాంతులకు గురిచేయడం మానుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తొలి ఆరు నెలల పాటు నిలిచిపోయిన ఈ ప్రాజెక్టు, అకస్మాత్తుగా ఎలా పట్టాలెక్కిందని కవిత ప్రశ్నించారు. ఈ అక్రమ నిర్మాణాలకు ఎవరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు, ఎవరి ప్రయోజనాల కోసం నిబంధనలను పక్కన పెట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ నది మురుగుకూపంగా మారుతున్నా పట్టించుకోని పాలకులు, ఆక్రమణలను ప్రోత్సహిస్తూ నది మనుగడకే ముప్పు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి వనరులను కాపాడుకోవడంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, ఒక చట్టం పేదలకు, మరో చట్టం బడా బాబులకు వర్తిస్తోందని దుయ్యబట్టారు.

ఆందోళన ఉధృతం కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ధర్నా విరమించి సహకరించాలని పోలీసులు కోరినప్పటికీ, కవిత మరియు జాగృతి నేతలు ససేమిరా అన్నారు. మూసీ అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు కదిలేది లేదని వారు భీష్మించుక కూర్చున్నారు. దీనితో పోలీసులు కవితను, ఇతర నాయకులను బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్లలోకి ఎక్కించారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. అరెస్టు చేసిన వారిని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టును నిరసిస్తూ స్టేషన్ వెలుపల కూడా జాగృతి శ్రేణులు భారీగా మోహరించి నిరసన తెలిపారు.

ప్రభుత్వం హైడ్రాను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని కవిత ఆరోపించారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో కొన్ని ప్రాంతాల్లో హడావుడి చేస్తూ, మరికొన్ని చోట్ల కళ్లు మూసుకోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోందని అన్నారు. మూసీ పునరుజ్జీవం గురించి గొప్పలు చెప్పే ముఖ్యమంత్రి, కళ్ల ముందే జరుగుతున్న ఈ నది ఆక్రమణలను ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు. ఈ అక్రమ వెంచర్లకు అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని, అందుకే అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ అక్రమ కట్టడాల వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోరాటం ఇక్కడితో ఆగిపోదని, నగరంలోని ప్రతి ఆక్రమిత చెరువు వద్ద ధర్నాలు నిర్వహిస్తామని కవిత హెచ్చరించారు. ప్రకృతి ప్రసాదించిన వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, కానీ రక్షించాల్సిన ప్రభుత్వమే భక్షక పాత్ర పోషిస్తోందని విమర్శించారు. అక్రమ నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ గళం వినిపిస్తూనే ఉంటామన్నారు. పోలీసులు ఎన్నిసార్లు అరెస్టు చేసినా, భౌతిక దాడులకు దిగినా భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆమె స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ప్రకటించారు.

నార్సింగి ఘటన నేపథ్యంలో స్థానికులు కూడా పెద్ద ఎత్తున కవితకు మద్దతు తెలిపారు. తమ ప్రాంతంలోని నీటి వనరులు కలుషితం కావడానికి, వరద ముప్పు పెరగడానికి ఈ అక్రమ కట్టడాలే కారణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా భవన అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా విచారణ జరిపించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మూసీ నది గర్భాన్ని కాపాడాలని, ఆక్రమణదారుల కబంధ హస్తాల నుంచి నదీ పరివాహక ప్రాంతాన్ని విముక్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కవిత అరెస్టుతో ఈ అంశం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మూసీ నది ఆక్రమణల అంశం ఇప్పుడు ఒక పెద్ద రాజకీయ యుద్ధానికి దారితీసింది. పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం చేసే చర్యలు నిష్పక్షపాతంగా ఉండాలని సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు. కవిత చేపట్టిన ఈ ఆందోళన అక్రమ నిర్మాణాలపై పాలకుల తీరును ఎండగట్టడంలో కీలక పాత్ర పోషించింది. పోలీసులు అరెస్టు చేసినా, ప్రజల్లోకి ఈ సమస్య బలంగా వెళ్ళిందని జాగృతి నేతలు అభిప్రాయపడుతున్నారు. మున్ముందు ఈ వివాదం ఎటువైపు దారితీస్తుందో, ప్రభుత్వం ఆక్రమణలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

## జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరాలు

**వాడవాడన రంగుల సందడి.. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆనందోత్సాహం**



**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లా వ్యాప్తంగా హోలీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. వాడవాడన రంగుల సందడి నెలకొని గ్రామాలు, పట్టణాలు ఉత్సాహంతో కళకళలాడాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు. ఉదయం నుంచే యువత బృందాలుగా చేరి, ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. వీధులన్నీ రంగుల మయంగా మారి పండుగ శోభను చాటాయి. హోలీ పర్వదినం సందర్భంగా స్నేహితులు, బంధువులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్నేహబంధాలను మరింత బలపరుచుకున్నారు. రంగుల కేళి మధ్య చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని 'హ్యాపీ హోలీ' అంటూ సందడి చేశారు. మహిళలు కూడా ఇంటి పనులను ముగించుకుని వేడుకల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా హోలీ పండుగ ఆనందోత్సాహాల మధ్య శాంతియుతంగా ముగిసింది.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో హోలీ సంబరాలు

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన జిల్లా ఎస్పీ డా. శబరిష్ ..సిబ్బందితో కలిసి రంగుల సందడి**



**మహబూబాబాద్, విశాలభారతి:** హోలీ పండుగ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం రంగుల కేళితో కళకళలాడింది. జిల్లా ఎస్పీ డా. శబరిష్ ఆధ్వర్యంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది కలిసి ఉత్సాహంగా హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఉదయం నుంచి కార్యాలయ ప్రాంగణంలో సిబ్బంది ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. డీజే పాటలకు కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ డా. శబరిష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సిబ్బందితో కలిసి సాదాసీదాగా రంగులు ఆడుతూ అందరితో ఆప్యాయంగా మెలగడం అందరి ప్రశంసలు అందుకుంది. హోలీ పర్వదినం సందర్భంగా పోలీస్ శాఖలో స్నేహభావం, ఐక్యత మరింత బలపడిందని అధికారులు తెలిపారు. ప్రజల భద్రతే తమ లక్ష్యమని, పండుగ రోజుల్లో కూడా విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. మొత్తం మీద జిల్లా పోలీస్ కార్యాలయంలో హోలీ సంబరాలు ఉత్సాహంగా, స్నేహపూర్వక వాతావరణంలో ఘనంగా జరిగాయి.

## ఘనంగా హోలీ సంబరాలు



**తిరుమలగిరి, విశాలభారతి:** మంగళవారం రోజు న వెలిశాల గ్రామంలో హోలీ వేడుకలు ఆర్ఆర్ విన్నర్స్ ఘనంగా జరుపుకున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా హోలీ నిలుస్తుందని క్లబ్ సెక్రటరీ నాగబాబు తెలిపారు. అలాగే ప్రజలంతా కూడా రంగుల మయంగా తమ జీవితాలను ఆనందంగా గడపాలని, కష్టసుఖాలను సమానంగా భావించాలని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో భాగంగా మహేశ్,స్వామి,రాజు, రమేష్,నాగబాబు, ప్రభాకర్,నవీన్, వెంకటేశ్,శాంతి కుమార్, పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన హోలీ పండగ సంబరాలు



**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర కాలనిలో మంగళవారం హోలీ పండుగను కాలనీ వాసులు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే రంగుల కేళి ప్రారంభమై ,చిన్నా-పెద్దా అన్న తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.పట్టణ వీధులన్నీ రంగులతో కళకళలాడుతూ పండుగ సందడి నింపాయి.యువత,మహిళలు, చిన్నపిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను మరింత రంగులమయం చేశారు.చిన్నారులు గులాల్ రంగులతో ఆడిపాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.పాటలు, నృత్యాలతో కాలనీ అంతా పండుగ వాతావరణం అలుముకుంది.హోలీ పండుగ సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని కాలనీ పెద్దలు పేర్కొన్నారు.పరస్పర కలహాలను మరచి స్నేహభావంతో ముందుకు సాగాలనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందన్నారు.పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కాలనీ యువకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

## నార్సింగిలో శ్రీ ఆదిత్య నిర్మాణంపై కవిత ఆందోళన




**రాజేంద్రనగర్, విశాలభారతి :** కల్వకుంట్ల కవిత నార్సింగిలో నిర్మాణంలో ఉన్న శ్రీ ఆదిత్య లగ్జరీ అపార్ట్‌మెంట్స్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. మధు పార్కు రిడ్జ్ నివాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆమె తెలంగాణ జాగృతి కార్యకర్తలు, నాయకులతో కలిసి నిరసన తెలిపారు. బండ్లగూడ జాగిర్ పరిధిలోని మూసి సమీపంలో ఉన్న మధు పార్కు రిడ్జ్ బఫర్ జోన్‌లో ఉందని చెబుతున్న ప్రభుత్వం, అదే విధంగా మూసీ నదిని ఆక్రమించి నిర్మిస్తున్న శ్రీ ఆదిత్య ప్రాజెక్ట్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పేరుతో పేదల ఇళ్లు కూల్చివేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ నిర్మాణాన్ని ఎందుకు ఆపడం లేదని విమర్శించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెంటనే బుల్డోజర్‌తో వచ్చి శ్రీ ఆదిత్య నిర్మాణాన్ని కూల్చివేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ నిర్మాణం చట్టబద్ధమని చెబితే, మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వకుండా మధు పార్కు రిడ్జ్ నివాసితులకు ఇదే ప్రాజెక్ట్‌లో ఫ్లాట్లు కేటాయించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో వెలుగుమట్లలో పట్టాలు ఇచ్చిన ఇళ్లను ఎలా కూలగొడతారని ప్రశ్నించిన ఆమె, హైదరాబాద్ చుట్టూ ఆక్రమణలు చేసి కట్టుకున్న పెద్దల భవనాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఖమ్మంలో పేదల ఇళ్లు కూల్చివేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఘటనాస్థలికి చేరుకొని చర్యలు తీసుకునే వరకు తాము అక్కడి నుంచి వెళ్లబోమని కవిత భీష్మించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదలంటే అలుసు అని ఆమె విమర్శించారు.

## బయ్యారం తాటి వనంలో యువత హోలీ సందడి



**బయ్యారం, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని తాటి వనంలో యువత హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. గీత కార్మికుడు రాజయ్య గౌడ్‌తో కలిసి యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా యువకులే పాల్గొన్నారు. పరస్పరం రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కులమత భేదాలు లేకుండా అందరూ ఒక్కటై స్నేహభావంతో హోలీని ఆనందంగా జరుపుకున్నారు. తాటి వనం మొత్తం రంగుల మేళవింపుతో సందడిగా మారింది. యువత నృత్యాలు, కేరింతలతో పండుగకు మరింత ఊపు తీసుకొచ్చారు. గ్రామంలో ఐక్యతకు ఈ హోలీ సంబరాలు నిదర్శనంగా నిలిచాయి.

## మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకుందాం

- **ప్రజల మధ్య ఐక్యత భావం పెంచుతున్న 'ఇఫ్తార్**
- **సమాజంలో శాంతిని నెలకొల్పుతున్న పవిత్ర రంజాన్ మాసం**
- **రంజాన్ మాస స్ఫూర్తితో రాగద్వేషాలు దూరం చేసుకోవాలి**
- **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**
- **జామ మసీదులో ఇఫ్తార్ కు హాజరైన ఎమ్మెల్యే కూనంనేని**



**పాల్వంచ విశాలభారతి:**

మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని, అందుకు పండుగలు దోహదపడతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని జామ మసీదులో ఇఫ్తార్ కార్యక్రమానికి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక నమాజు అనంతరం ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతాభావం పెంచుతున్నాయని అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సమాజంలో శాంతిని నెలకొల్పుతుందని, ప్రజల, కులాలు, మతాల మధ్య గద్వేషాలను దూరం చేస్తుందన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు చేపట్టిన కఠినమైన ఉపవాస దీక్షలు వారి కుటుంబాలతో పాటు సమాజంలో శాంతిని, ప్రేమను నెలకొల్పడానికి, సోదర భావం, దాతృత్వాన్ని పెంచడానికి దోహదపడుతుందని, ప్రజాస్వామ్య దేశంలో కుల మతాలకతీతంగా మతసామరస్యాన్ని చాటి చెబుతోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసం, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులకు తాను చేస్తున్న కృషికి ప్రజలు, అధికారులు సహకరించి మరింతగా ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి SK సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ముస్లిం మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు ఇట్టి వెంకట్రావు, గౌతమి కృష్ణ, వల్లపు యాకయ్య, ఉప్పుశెట్టి రాకేష్, వెంకటరత్నం, కర్రు రమేష్, మస్తాన్, ఆది నారాయణ, దినేష్, రామాచారి, అల్లి వెంకటేశ్వర్లు, బీమా నాయక్, వెంకటేశ్వర్లు, లాల్ పాషా, మసీదు పెద్దలు ఫయాజ్, అభిద్, అక్బర్, మస్తాన్, గౌస్, కృర్షిద్, ముత్తు జాలి, కురిషి, రషీద్, రెహమాన్, గౌస్, అంజద్, పాల్గొన్నారు.

## లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



**విశాలభారతి:**

కరకగూడెం మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమత్ బట్టు పల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ జ్వాలా లక్ష్మి నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు స్వామివారికి పంచామృత స్నానం చేయించి, పట్టువస్త్రాలు సమర్పించి లక్ష్మి నరసింహ స్వామి వారిని భక్తి భావంతో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ , మాజీ సర్పంచులు పోలేబోయిన శ్రీవాణి తిరుపతయ్య , తోలెం నాగేశ్వరరావు , మండల నాయకులు ఎర్ర సురేష్ , గొగ్గలి రవి , భూక్య రాందాస్ , షేక్ రఫీ , కొమరం వెంకటేశ్వర్లు , దెంచనల రాజేంద్ర ప్రసాద్ , దుర్గం కన్నయ్య , కరకపల్లి నాగేష్ తదితరులు హాజరయ్యారు. సర్పంచులు తోలెం రమాదేవి (బట్టుపల్లి), కొమరం సుగుణ (చిరుమల్ల), చౌలం కేశవరావు (వెంకటాపురం), పోలేబోయిన సుజాత (కరకగూడెం), ఎర్రం పొట్టయ్య (కొత్తగూడెం), తోలెం రమేష్ (పద్మాపురం) మరియు ఉప సర్పంచులు గాందర్ల రామనాథం (తాటిగూడెం), ఇర్రి వెంకన్న (బట్టుపల్లి) అర్చకులు నరసింహాచారి, ధర్మకర్త రవితేజ , కమిటీ సభ్యులు పోలబోయిన శంకరయ్య , మైపతి రంగారావు , మైపతి శంకరరావు , సత్యనారాయణ , కొమరం నర్సింహులు , పాయం నరసింహారావు , పాయం సాంబయ్య , పోలేబోయిన నారాయణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సురంగల్ మున్సిపాలిటీలో ఉత్సాహంగా హోలీ వేడుకలు: చిన్నారుల సందడి



**మొయినాబాద్ , విశాలభారతి:** సురంగల్ మున్సిపాలిటీ పరిధిలో హోలీ పండుగను చిన్నారులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. గ్రామ వీధుల్లో రంగులు చల్లుకుంటూ, ఒకరిపై ఒకరు రంగులు వేసుకుంటూ చిన్నారులు ఉల్లాసంగా ఆడిపాడారు. సాంప్రదాయబద్ధంగా హోలీ పండుగను జరుపుకుంటూ పిల్లలు హ్యాపీ హోలీ అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. రంగుల సందడితో వీధులు కళకళలాడాయి. స్థానికులు కూడా చిన్నారుల ఆనందాన్ని ఆస్వాదిస్తూ పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దల పర్యవేక్షణలో వేడుకలు ప్రశాంతంగా సాగాయి. రంగుల పండుగగా పేరుగాంచిన హోలీ సందర్భంగా సురంగల్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

## హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనంలో పాల్గొన్న ఎంపీ ఈటల



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని వెంకులోనిగుట్ట, రాంపల్లి దాయర గ్రామంలో ఉన్న హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామివారి క్షేత్రం ను ఈటల రాజేందర్ తో కలిసి దర్శించుకున్నారు హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.క్షేత్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మండలం మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఘనంగా హోలీ సంబరాలు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హోలీ పండుగ సందర్భంగా పెద్ద అంబర్పేట్ డివిజన్ పరిధిలోని పసుమాముల గ్రామం శ్రీనగర్ కాలనీలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీలోని చిన్నారులు, మహిళలు, పెద్దలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రంగుల మధ్య ఆనందంగా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ.. హోలీ పండుగ ఆనందం, ఐక్యత, సోదరభావానికి ప్రతీక అని పేర్కొంటూ కాలనీవాసులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సఖ్యతను పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి పాషా భాయ్, వైస్ ప్రెసిడెంట్ చైతన్య, ట్రెజరర్ అరవింద్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, కల్చరల్ సెక్రెటరీ శ్రీకాంత్ గౌడ్, సభ్యులు రామకృష్ణ, వెంకటరమణతో పాటు కాలనీ మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



విశాల భారతి



# నిత్యశ్రీ–చైత్ర మృతులపై నివేదిక ఆలస్యం ఎందుకు?

- **గత కలెక్టర్ కు ఎన్నిసార్లు పిర్యాదు చేసిన ఫలితం లేదు**
- **స్థానిక ఎమ్మెల్యే డా. రామచంద్ర నాయక్ ఈ విషయంలో తక్షణ జోక్యం చేసుకుని న్యాయం చేయాలి**
- **న్యాయం కోసం ప్రజావాణిలో నూతన కలెక్టర్ కు పిర్యాదు**
- **తల్లిదండ్రులు, బిఎస్పీ రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్**

**మహబూబాబాద్, విశాలభారతి:**





మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం గ్రామం ఇటుకలగడ్డ తండాలో చోటుచేసుకున్న నిత్యశ్రీ–చైత్ర చిన్నారుల మృతి తల్లులకు కడుపు కోత మిగిల్చిన ఘటనకు సంబంధించిన నిజ నిర్ధారణ కమిటీ నివేదిక ఇంకా వెలుగులోకి రాకపోవడం తీవ్ర అనుమానాలకు దారి తీస్తోంది. అమాయక బాలికల ప్రాణాలు బలైన ఈ విషాదం రెండు నెలలు దాటినా, “విచారణ కొనసాగుతోంది” అనే మాట తప్ప అధికారుల నుంచి స్పష్టత రావడం లేదు. అంగన్వాడీ కేంద్రంలో అందించిన ఆహారం తీసుకున్న తర్వాత చిన్నారులకు అనారోగ్య లక్షణాలు కనిపించగా, ఆస్పత్రికి తరలించినప్పటికీ చైత్ర, నిత్యశ్రీలు మృతి చెందడం ప్రజలను కలచివేసింది. అయితే విచారణ పేరుతో ఐదుగురు సభ్యులతో కమిటీ నియమించినప్పటికీ నివేదికను విడుదల చేయకపోవడం అనుమానాస్పదం కాదా?

**ఇక్కడ ప్రధాన ప్రశ్నలు మళ్లీ తలెత్తుతున్నాయి**

నివేదిక సిద్ధమైందా? అయితే ఎందుకు బయటపెట్టడం లేదు? ఎవరి ప్రయోజనాల కోసం ఈ ఆలస్యం? అంగన్వాడీ టీచర్, ఆయా, సంబంధిత అధికారులపై చర్యలు ఎందుకు కనిపించడం లేదు? చిన్నారుల మృతి కారణాలపై వైద్య శాఖ స్పష్టమైన నివేదిక ఎందుకు ఇవ్వలేకపోతోంది? అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

**పరిపాలనా వ్యవస్థలో స్పందన ఏది**

గత కలెక్టర్‌కు బాధిత కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఎన్నోసార్లు పిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిపాలనా వ్యవస్థలో స్పందన లేకపోవడం బాధిత కుటుంబాలను మరింత వేదనకు గురిచేస్తోంది. న్యాయం కోసం ఎదురు చూస్తున్న వారి ఆశలు ప్రతి రోజూ మసకబారుతున్నాయి. ఇప్పుడు బాధ్యత నూతన కలెక్టర్‌పై ఉంది. ఈ ఘటనపై తక్షణ సమీక్ష నిర్వహించి నిజ నిర్ధారణ నివేదికను ప్రజలకు వెల్లడించాలి. చిన్నారుల మృతికి కారకులెవరైనా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యం నిరూపితమైతే సంబంధిత అంగన్వాడీ సిబ్బంది, పర్యవేక్షణాధికారులు ఎవరైనా సరే బాధ్యత నుంచి తప్పించుకోరాదనే సందేశం ఇవ్వాలి. బాధిత కుటుంబాలకు తక్షణ ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం అత్యవసరం. చిన్నారుల మృతి ఒక కుటుంబ దుర్ఘటన మాత్రమే కాదు.., అది పరిపాలనా బాధ్యతకు సంబంధించిన ప్రశ్న. నివేదికను దాచిపెట్టడం ద్వారా నిజం మరుగున పడదు. పారదర్శకతతో ముందుకు వస్తేనే ప్రజల నమ్మకం నిలుస్తుంది.

**“మా పిల్లలకు న్యాయం ఎప్పుడు?**

తల్లిదండ్రుల కళ్లలో ఒక్క ప్రశ్నే మెదులుతోంది న్యాయం కోసం ఎదురు చూస్తున్న నిత్యశ్రీ–చైత్ర మృతులపై నివేదిక విడుదల చేయాలి. కమిటీ రిపోర్ట్‌పై మౌనం ఎందుకు? కలెక్టర్ తక్షణ స్పందించాలని తల్లిదండ్రులు, బిఎస్పీ రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్ లు సోమవారం జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.., మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం గ్రామం ఇటుకలగడ్డ తండాలో చోటుచేసుకున్న నిత్యశ్రీ, చైత్ర చిన్నారుల మృతి ఘటనపై నియమించిన నిజ నిర్ధారణ కమిటీ నివేదిక ఇంకా వెలుగులోకి రాకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. రెండు అమాయక ప్రాణాలు కోల్పోయిన ఘటనలో అధికారుల ఆలస్యం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. నవంబర్ 14, 2025న అంగన్వాడీ కేంద్రంలో అందించిన ఆహారం తీసుకున్న తర్వాత చిన్నారులకు అనారోగ్య లక్షణాలు కనిపించగా, ఆస్పత్రికి తరలించినప్పటికీ చైత్ర, నిత్యశ్రీలు మృతి చెందడం విషాదకరం. ఈ ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు చేసినా దాదాపు రెండు నెలలు గడిచినా నివేదికను విడుదల చేయకపోవడం పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించి తక్షణ స్పందన కోరడం ప్రస్తుత పరిస్థితుల్లో సముచితం. సంబంధిత అంగన్వాడీ సిబ్బందిపై చర్యలు తీసుకున్నారో లేదో స్పష్టత లేకపోవడం, వైద్య శాఖ కూడా మృతి కారణాలపై నివేదిక ఇవ్వకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే డా. రామచంద్ర నాయక్ ఈ విషయంలో తక్షణ జోక్యం చేసుకుని నిజ నిర్ధారణ నివేదికను ప్రజలకు వెల్లడించాలి. నిర్లక్ష్యం నిరూపితమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి న్యాయం జరిగిందనే నమ్మకం కల్పించాలి. చిన్నారుల ప్రాణాల విషయంలో ఆలస్యం అర్థం కాదు. నిజం బయటకు రావాలి, న్యాయం జరగాలని కోరారు.

## తెలంగాణ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు

**బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు**

**సికింద్రాబాద్, విశాలభారతి:** బిజెపి సీనియర్ నాయకురాలు మేకల కీర్తి హర్షకిరణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు నేను. రామచంద్ర రావు నివాసం వద్ద ఘనంగా హోలీ సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గం నాయకులు రామచంద్ర రావు సమక్షంలో హోలీ వేడుకలు నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్ర రావు మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ప్రజలందరూ హోలీ వేడుకలు నిర్వహించుకుంటున్నారని,అందరూ మంచి వాతావరణం లో హోలీని కెమికల్ రంగులతో కాకుండా సాంప్రదాయమైన రంగులతో పండుగ చేసుకోవాలని ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని తెలంగాణ ప్రజలు హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. అందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ నందనం దివాకర్, మేకల సారంగపాణి, సీనియర్ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, హరి, గణేష్ ముదిరాజ్, ఆకారం రమేష్,కృష్ణ మూర్తి, అనిత, అనూష, రాము వర్మ, ప్రకాష్ గౌడ్, సేతి మహేష్, ఆకుల శ్రీనివాస్, సుబ్బారావు, బిక్షపతి,ఈఎల్ నరేష్, నాగరాణి, శోభారాణి, భాగ్యమ్మ, శ్రీదేవి, మమత, యాదమ్మ, సతీష్ రెడ్డి, కర్ణ, సోను, తీయల్ ప్రతాప్ కుమార్, క్రాంతి, ఆకుల సంపత్, హనుమంతు ముదిరాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.





## అంటార్కిటికాలో వారణాసి

ఇటీవలే జార్జియాలో ‘వారణాసి’ చిత్రం తాలూకు మేజర్ షెడ్యూల్ పూర్తయింది. అక్కడ రామాయణం నేపథ్య కీలక ఘట్టాలను తెరకెక్కించినట్లు తెలిసింది. మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న వరల్డ్‌వైడ్‌గా ఈ సినిమా విడుదలకానుంది. ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన తాజా అప్‌డేట్‌ను చిత్ర కథానాయిక ప్రియాంకచోప్రా తన సోషల్‌మీడియా ద్వారా పంచుకుంది. ఆమె తాజా హాలీవుడ్ చిత్రం ‘ది బ్లఫ్’ ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇందులో ప్రియాంకచోప్రా అభినయాన్ని ప్రశంసిస్తూ మహేష్‌బాబు ఓ పోస్ట్ పెట్టారు. దీనికి ప్రియాంక చోప్రా ‘థాంక్యూ మై ఫ్రెండ్.. త్వరలో అంటార్కిటికాలో కలుద్దాం’ అని రిప్లై ఇచ్చింది. దాంతో ‘వారణాసి’ తదుపరి షెడ్యూల్‌పై అప్‌డేట్ వచ్చిందంటూ అభిమానులు ఈ న్యూస్‌ను షేర్ చేస్తున్నారు. భూమిపై అత్యంత శీతల ప్రాంతమైన అంటార్కిటికాలో షూటింగ్ జరపడం కష్టసాధ్యంగా భావిస్తారు. రవాణా సౌకర్యాలతో పాటు అక్కడ వసతి ఏర్పాట్లు చేసుకోవడం సవాళ్లతో కూడుకున్న వ్యవహారం. అందుకే కొన్ని హాలీవుడ్ సినిమాలు తప్ప ఇప్పటివరకు ఏ భారతీయ సినిమా అక్కడ షూటింగ్ జరుపుకోలేదు. తొలిసారి ఈ ప్రయత్నం చేస్తున్నారు దర్శకుడు రాజమౌళి. భారతీయ పురాణాలు, టైమ్ ట్రావెల్ కలబోసిన సాహసగాథగా అత్యంత భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రియాంకచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.